క్లుప్తంగా

వైభవంగా భేతాళ స్వామి ఆలయ వార్షికోత్సవం


విజయ భేతాళస్వామి

అంబాజీపేట: స్థానిక శ్రీనివాస నగర్‌లో వేంచేసిన విజయ భేతాళ స్వామి వారి తృతీయ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం, 13 పాలాలకు చెందిన సంఘ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద అన్నసమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘ నాయకులు, పాలాల పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

నీటిగుంతలు లేకుండా చూసుకోవాలి


అంబాజీపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అంబాజీపేట: ఇంటి పరిసరాల్లో నీటి గుంతలు, నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని వైద్యాధికారి వి.గౌతమి అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీని సోమవారం నిర్వహించారు. డాక్టర్ గౌతమి మాట్లాడుతూ ప్రతి కుటుంబం తమ ఇంటి ముందు నీటి నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాడి పాడేసిన కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లు, మొక్కల కుండీలు, ఫ్రీజర్, వాటర్ కూలర్లలో నీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టాలని, మలేరియా వ్యాధి రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బి.అప్పారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


అప్పనపల్లిలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ కార్యవర్గ సభ్యుడు పవన్

మామిడికుదురు: ఎన్డీఏ కేంద్రంలో అధికారం చేపట్టి హ్యాట్రిక్ సాధించడం, నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావడంతో కూటమి నేతలు అప్పనపల్లిలో ఆదివారం రాత్రి విజయోత్సవం నిర్వహించారు. జనసేన నేత తులా బ్రహ్మాజీ ఆధ్వర్యంలో బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్ కేక్ కట్ చేశారు. గ్రామ పరిధిలోని అరుంధతీపేటకు చెందిన పేదలకు దుప్పట్లు, చీరలు, బియ్యంతో పాటు నిత్యావసరాలు అందజేశారు. జనసేన నాయకులు ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ, కంకిపాటి నర్సింహారావు, మేడేపల్లి చినసత్యనారాయణ, బీజేపీ నాయకులు మెండా ఆదినారాయణ, కంకిపాటి సుబ్బారావు, నుదురుమాటి సత్యమాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ సేవలు అభినందనీయం


ఎంపీడీఓ వీరాస్వామి నాయుడు దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ సత్యవాణి తోటి ఉద్యోగులు

మలికిపురం: మలికిపురం ఎంపీడీఓ ముత్యం వీరాస్వామి నాయుడు సేవలు అభినందనీయమని ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి పేర్కొన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఎంపీడీఓను సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా సేవే పరమావధిగా వీరాస్వామి ఎనలేని సేవలు అందించారని పేర్కొన్నారు. పంచాయతీ, సచివాలయ సిబ్బందితో సక్రమంగా విధులు నిర్వహింపచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ బి.మంగాదేవి, సూపరింటెండెంట్ జి.మిల్లన్, కార్యదర్శులు రేకపల్లి ఏసుబాబు, సుభాకర్, పాల్గొన్నారు.

శ్రీనుబాబు మృతి తీరని లోటు

రాజోలు: రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి పాలిక శ్రీనుబాబు మృతి తీరని లోటని రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం రాజోలులో తెన్నేటి నగర్‌లోని శ్రీనుబాబు కుటుంబ సభ్యులను రాపాక పరామర్శించారు. శ్రీనిబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జర్నలిస్ట్‌గా అనేక సామాజిక కార్యక్రమాలను శ్రీనుబాబు చేపట్టేవారన్నారు. ఆయన సేవలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గుబ్బల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వామ్మో పిడుగు .. తస్మాత్ జాగ్రత్త

- వర్షాకాలంలో పొంచి ఉన్న ముప్పు
- అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ


పిడుగు పడుతున్న దృశ్యం (ఫైల్)

అంబాజీపేట: వర్షాకాలం వచ్చిందంటే ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తూ ఉంటాయి. ఈ నేపథ్యంలో పిడుగులు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పిడుగు ఎప్పుడు పడుతుందో, ఎలా పడుతుందో తెలియని పరిస్థితిలో ప్రమాదాలు వాటిల్లి ఒక్కోసారి ప్రాణ నష్టం కలుగుతుంది. మెరుపుల ధాటికి గృహోపకరణాలు కాలిపోతూ ఉంటాయి. పిడుగులోని కాంతి ప్రభావంతో నష్టం భారీగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో పిడుగు నుంచి రక్షించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల శాఖ ఎప్పటికప్పుడు మెసేజ్‌ల రూపంలో హెచ్చరికలు జారీ చేస్తుంది. జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని ఆ శాఖ అధికారులు చెప్తున్నారు. అంటే వాతావరణంలో చోటు చేసుకున్న పరిణామాలతో ఒక్కసారిగా ఆకాశమంతా మేఘావృతమై మెరుపు వేగంతో విద్యుత్ కాంతి తీగ రూపంలో నేలకు చేరుకుంటుంది. ఒక్కసారిగా విద్యుదావేశం పెరిగి మేఘాల సమీపంలో వ్యతిరేక విద్యుదావేశం ఉన్నప్పుడు వాతావరణంలోని తేమ, దుమ్ము కారణంగా వాటిలోని స్థిర విద్యుత్ భూమి వైపు ప్రవహిస్తుంది. ఒక మిల్లీ సెకన్ కాలంలో మెరుపుతో కూడిన పిడుగు 20 వేల ఆంపియర్ల విద్యుత్ ప్రవాహాన్ని విడుదల చేస్తుంది. అప్పుడు ఏర్పడే విద్యుత్ క్షేత్ర తీవ్రత మీటరుకు 2 లక్షల ఓల్టులతో సమానం. ఇది భూమి నుంచి 1 నుంచి 2 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. 2 మేఘాల మధ్య అయితే 7 కిలోమీటర్ల నుంచి 140 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. మెరుపులు భూమి మీద పడినప్పుడు వస్తువులను బట్టి నష్ట తీవ్రత ఉంటుంది.

కాపర్ ఎర్త్ ఏర్పాటుతో ప్రమాదానికి చెక్

పిడుగు పాటు నుంచి తప్పించుకునేందుకు ఎత్తైన ప్రదేశం నుంచి నేరుగా భూమిలోకి కాపర్ ఎర్త్ (రాగి వైరును అనుసంధానం చేస్తూ భూమిలోకి పాతాలి) ఏర్పాటు చేయడం ద్వారా దాదాపు కిలో మీటరు దూరంలో పడిన పిడుగును నేరుగా భూమిలోకి ఇదే ఆకర్షించుకుంటుంది. ఎర్త్ వైర్‌ను ఉప్పు, కర్పూర బొగ్గు, నీటి మిశ్రమాలతో రాగి వైరు కలిగిన రాడ్ను భూమి లోపలికి ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది.

పాటించాల్సిన జాగ్రత్తలు

వర్షం వచ్చేటప్పుడు చెట్ల కింద ఉండకూడదు. ముఖ్యంగా ఎత్తైన చెట్టు కింద అస్సలు ఉండకూడదు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తే రైతులు పొలాల వద్ద బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదు. లక్షల డిగ్రీల ఉష్ణోగ్రతతో విడుదలయ్యే వేడి ఒక్కసారిగా మనిషిని చేరగానే గుండెపై ప్రభావం చూపుతుంది. వర్షపు సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోల్టులు, కెమెరాలు, సెల్‌ఫోన్లు దగ్గర లేకుండా చూసుకోవాలి. లేకుంటే రేడియేషన్ తరంగాలకు గురై ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మెరుపులు, పిడుగుల వల్ల విద్యుత్ ఉపకరణాలు కాలిపోయే అవకాశం ఉంది. ఆ సమయంలో టీవీలకు ఉన్న విద్యుత్ కేబుల్ కనెక్షన్ తొలగించాలి. వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. తడి ప్రదేశాల్లో ఉండకపోవడం చాలా మంచిది.

ఎత్తైన టవర్లు ఏర్పాటు చేసేటప్పుడు పలు జాగ్రత్తలు పాటించడంతో పిడుగుపాటు నుంచి తప్పించుకునే అవకాశం ఉంది.

పార్టీ కార్యకర్తలు సంయమనం పాటించాలి


తాటిపాకలో మాట్లాడుతున్న గొల్లపల్లి

రాజోలు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు గ్రామాల్లో సంయమనం పాటించాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కోరారు. సోమవారం తాటిపాకలో ఆయనను నియోజకవర్గంలోని గూడపల్లి పల్లిపాలెం, అంతర్వేది, తాటిపాక, రాజోలు తదితర గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. అధికార పార్టీకి చెందిన కొందరు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా గొల్లపల్లి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సర్వసాధారణమన్నారు. విజేతగా నిలిచిన వర్గాలు సమస్యలపై దృష్టి సారించాలని, రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో కక్షపూరిత చర్యలకు పాల్పడడం బాధాకరంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తల కోసం అధినాయకత్వం నియోజకవర్గాల వారీగా లీగల్ టీంను ఏర్పాటు చేసిందన్నారు. గ్రామాల్లో శాంతియుతంగా మెలగాలని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అధికార పార్టీ ఇబ్బందులకు గురైతే తక్షణం లీగల్ టీం ద్వారా పోలీస్, కోర్టుల ద్వారా రక్షణ పొందేందుకు లీగల్ టీంలు అండగా నిలుస్తాయమన్నారు. గూడపల్లి పల్లిపాలెం సర్పంచ్ నరసింహస్వామి, నాయకులు కృష్ణమూర్తి, నల్లి సత్యం, కందికట్ల శ్రీను, అడబాల జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంఎంఎస్‌ఏతోనే మాతృ, శిశు మరణాల నివారణ


పెదపళ్లలో బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సాయికిషోర్

ఆలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్‌ఏ) పథకం విశేషంగా దోహదపడుతుందని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, పి.భవానీశంకర్, ఆర్.మల్లికార్జున్, డి.సాయికిశోర్ అన్నారు. పీఎంఎంఎస్‌ఏ పథకంలో భాగంగా ఆయా పీహెచ్‌సీలో నిర్వహించిన పీఎంఎంఎస్‌ఏ శిబిరంలో సుమారు 132 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. సమావేశంలో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను, తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది వివరించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా తొమ్మిది లేక పదో తేదీన బాలింతలు, గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు సుఖ ప్రసవాలు జరిగే విధంగా కృషి చేస్తున్న పీహెచ్‌సీల సేవలను ప్రజలకు తెలియజేయాలని వైద్యారోగ్య సిబ్బందికి వారు సూచించారు. వైద్యాధికారులు కోరారు. సీహెచ్‌ఓ పి.పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవివి.రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం


బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.20 వేల నదును ఆర్థిక సాయంగా సోమవారం అందజేశారు. మండలంలోని దేవరపల్లి గ్రామానికి చెందిన గుత్తుల సాయి శ్రీకృష్ణ నెల రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. యాక్సిడెంట్ చేసిన వాళ్లు ఆపరేషన్ చేయించారు. సాయి శ్రీ కృష్ణ తండ్రి కూలి పనులకు వెళుతుంటారు. ఆపరేషన్ అనంతరం మందులకు, వైద్యానికి డబ్బులు లేని పరిస్థితి. దీంతో కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరాగా దేవరపల్లిలో శ్రీకృష్ణ ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.20 వేల నగదు అందజేశారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

రావులపాలెం: అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులకు కాంగ్రెస్ పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి రౌతు ఈశ్వరరావు రూ.వెయ్యి నగదు, వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఆలమూరు గ్రామ శివారు వెలమల వీధిలో నివాసం ఉంటున్న మట్ట సత్యవతి, సత్యనారాయణ దంపతులు పూరిపాకలో నివాసం ఉంటున్నారు. అగ్ని ప్రమాదం జరిగి పూర్తిగా నష్టపోవడంతో విషయం తెలుసుకున్న ఈశ్వరరావు వారిని పరామర్శించి, స్థానిక రౌతు ట్రస్టు కార్యాలయంలో సోమవారం సాయం అందజేశారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

మామిడికుదురు: బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల జోలికొస్తే సహించేది లేదని దళిత సంఘాల నేతలు స్పష్టం చేశారు. పెదపట్నంలోని భూపతివారిపేటలో రిటైర్డ్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ భూపతి వెంకటపతి అధ్యక్షతన సోమవారం జరిగిన దళిత నాయకుల సమావేశం కె.గంగవరం మండలం ఎర్రపోతవరంలో అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించడాన్ని తీవ్రంగా ఖండించారు. రాజకీయ పార్టీల ముసుగులో అంబేడ్కర్ విగ్రహాల జోలికి వస్తే దళిత సమాజం చూస్తూ ఊరుకోదన్నారు. దీనిపై పోలీసులు తక్షణం స్పందించి దుండగులను అరెస్టు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. అంబేడ్కర్ విగ్రహాల పరిరక్షణకు నిఘా బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షులు బొంతు మణిరాజు, మండల అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షులు కలిగితి పళ్లంరాజు, కార్యదర్శి మట్టా సత్తిబాబు, నాయకులు కుసుమ పెరుమాళ్లకుమార్, భూపతి పరమేష్, నీతిపూడి మహేష్, నక్కా రమణ పాల్గొన్నారు.

నేర్చుకోవడం విద్యార్థుల ఉత్తమ లక్షణం


అంబాజీపేటలో విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసిన ఎంఈఓలు వెంకటేశ్వరరావు, ప్రకాష్, ఎస్సై చిరంజీవి

అంబాజీపేట: ఉపాధ్యాయులు, పెద్దలు చెప్పే ప్రతి విషయాన్ని విని నేర్చుకోవడం విద్యార్థులకు ఉండవలసిన ఉత్తమ లక్షణమని ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఎస్సై కె.చిరంజీవి అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో గత నెల రోజులుగా నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ ముగింపు కార్యక్రమం గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం జరిగింది. వారు మాట్లాడుతూ బాల్యం, యవ్వనంలోనే నేర్చుకొని, చదువుకునే అవకాశం లభిస్తుందని, సద్వినియోగం చేసుకున్నప్పుడే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతామన్నారు. చెడు అలవాట్లకు లోనుకాకుండా, చదువును నిర్లక్ష్యం చేయకుండా మంచి ప్రణాళికతో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. శిక్షణ శిబిరానికి వచ్చిన 25 మంది విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్‌ను అందజేశారు. అనంతరం ఎంఈఓలను, ఎస్సైని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యోగా గురువు యోగా శ్రీనివాస్, రీడర్స్ పాల్గొన్నారు.

మోరిని మోడల్ విలేజ్‌గా తయారు చేసుకోవాలి


మోరిపోడు రివర్‌సైడు స్కూల్ ఆవరణలో కుట్టు మెషీన్ శిక్షణ సర్టిఫికెట్లు ఇస్తున్న జేసీ నూపుర్‌అజయ్

సఖినేటిపల్లి: సమాజం కోసం చేస్తున్న మంచి పనులను పోషించుకుని మోరి ప్రజలంతా మోరిని మోడల్ విలేజ్‌గా తయారు చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జేసీ నూపుర్ అజయ్ సూచించారు. సోమవారం మోరిపోడు సుబ్బమ్మ హాస్పిటల్ నేతృత్వంలో కమ్యూనిటీ హెల్త్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఇండియా ట్రస్ట్ చైర్మన్ నల్లి డార్విన్ మోరి–మోరిపోడు సరిహద్దులోని మొండికోడు చానల్‌కు పొక్లెయిన్‌తో చేపట్టిన పనులను జేసీ నూపుర్ పరిశీలించారు. అలాగే అక్కడే ఆయకట్టు రైతులతో జేసీ మాట్లాడారు. అనంతరం జేసీ మాట్లాడుతూ, ఏటా పంట కాలువలు కాలుష్యం పైన, అవి మూసుకుపోతున్న వైనంపై రైతులు తెస్తున్న సమస్యలపై తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల కోసం చేపడుతున్న పనులకు ప్రజలంతా సహకరించి, పంట కాలువలను పరిశుభ్రంగా చూసుకోవాలని జేసీ హితవు పలికారు. రివర్‌సైడు స్కూల్ ఆవరణలో ప్రాజెక్ట్ ఇండియా సౌజన్యంతో ఏర్పాటు చేయనున్న కమ్యూనిటీ ఎడ్యుకేషన్ సెంటర్‌కు జేసీ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే ఉషా ఇంటర్నేషనల్, ప్రాజెక్ట్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మెషీన్ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను జేసీ పంపిణీ చేశారు. వీటితో పాటు సుబ్బమ్మ మిషన్ హాస్పిటల్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై రూపొందించిన డాక్యుమెంట్‌ను స్క్రీన్‌పై డాక్టర్ లత, జేసీ నూపుర్ అజయ్‌కు వివరించారు. వీవీర్స్ సొసైటీ మాజీ అధ్యక్షుడు జాన శంకరరావు, మోరి, మోరిపోడు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

యోగా జడ్జిలుగా ఎంపికైన కోచ్‌లు


రాష్ట్ర స్థాయి యోగా జడ్జిలుగా ఎంపికైన సత్యశ్రీ, సంధ్యారాణి, ధర్మతేజ

రావులపాలెం: స్థానిక యోగా కోచ్లైన సత్యశ్రీ, సంధ్యారాణి, ధర్మతేజలు రాష్ట్రస్థాయి యోగా జడ్జిలుగా ఎంపికైనట్లు సోమవారం సత్యశ్రీ తెలిపారు. ఈనెల ఏడో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు రాజమహేంద్రవరంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన స్టేట్ లెవెల్ జడ్జిస్ ట్రైనింగ్‌లో పాల్గొని ఈ అర్హత పొందినట్లు సత్యశ్రీ తెలిపారు. ఇంటర్నేషనల్ యోగా జడ్జి కేఎస్‌వీ శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా అర్హత పత్రాలు పొందినట్లు తెలిపారు.

వీఆర్‌ఏల నూతన కార్యవర్గం ఎన్నిక


రాజోలు మండల వీఆర్‌ఏల నూతన కార్యవర్గం

రాజోలు: మండల గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ నూతన కార్యవర్గం సోమవారం ఏర్పాటైంది. మండల అధ్యక్షుడిగా కుసుమ రామకృష్ణ, కార్యదర్శిగా సోడదాసు సునీల్‌రాజా, ఉపాధ్యక్షుడిగా చాగంటి రాజ్‌కుమార్, కోశాధికారిగా కలిగితి నాగేశ్వరరావు, సంఘ గౌరవ అధ్యక్షుడిగా గుండాబత్తుల సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు దారపురెడ్డి వీరభద్రం మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యలపై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. నూతన కార్యవర్గాన్ని ఆయన అభినందించారు.

ఇసుక నిల్వల సీజ్

రావులపాలెం: మండలంలో రావులపాడు జాతీయ రహదారి పక్కన గతంలో నిల్వ ఉంచిన ఇసుక నిల్వలను మైనింగ్ శాఖ అధికారులు సీజ్ చేసి తమకు అప్పగించినట్లు సోమవారం తహసీల్దార్ అశోక్ వర్మ తెలిపారు. మైనింగ్ అధికారులు ఇసుక నిల్వలను పరిశీలించి సీజ్ చేశారని, అనంతరం గ్రామ వీఆర్వోకు అప్పగించారన్నారు.

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం


శ్రీకాంత్‌కు స్వామి చిత్రపటాన్ని, లడ్డూను అందజేస్తున్న అర్చకులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయంలో అమలుచేస్తున్న నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రాజమహేంద్రవరానికి చెందిన బండి శ్రీకాంత్ సోమవారం రూ.10,116 విరాళంగా అందజేశారు. తన తల్లి బండి భవాని జ్ఞాపకార్థంగా అందజేస్తున్నట్లు శ్రీకాంత్ తెలిపారు. ఈ విరాళాన్ని ఆలయ అర్చకులకు అందజేశారని ఏసీ గ్రంధి మాధవి తెలిపారు. విరాళాలు అందించిన దాతకు ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం అందజేశారు.

పంపిణీకి పాఠ్య పుస్తకాలు సిద్ధం

మామిడికుదురు: మండలంలో 2024–25 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్య పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు సోమవారం తెలిపారు. ఒకటో తరగతి నుంచి 7వ తరగతి వరకు విద్యార్థులకు పంపిణీ చేసేందుకు 16,742 పాఠ్య పుస్తకాలు అవసరమన్నారు. కాగా ఇంత వరకు 4,992 పాఠ్య పుస్తకాలు లూటుకుర్రు స్టాకు పాయింట్‌కు చేరాయని చెప్పారు. 3,5,6 తరగతుల పాఠ్య పుస్తకాలు ఆరు టైటిళ్లకు గాను రెండు టైటిల్స్ వచ్చాయన్నారు. 4,7 తరగతుల పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. 8,9,10 తరగతుల పాఠ్య పుస్తకాలు పూర్తిగా వచ్చాయన్నారు. పదో తరగతి ఫిజికల్ సైన్స్ పుస్తకాలు రావాల్సి ఉందని చెప్పారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 33,527 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా, ఇంత వరకు 21,777 పుస్తకాలు వచ్చాయని తెలిపారు. ఇంకా 11,750 పాఠ్య పుస్తకాలు రావల్సి ఉందన్నారు.

వ్యర్థాలను పంట కాలువలో వేయొద్దు

అంబాజీపేట: ప్రధాన పంట కాలువల్లో ఎటువంటి చెత్తా చెదారం, కళేబరాలను పడవేయవద్దని ఇరిగేషన్ ఏఈ నవీన్‌కుమార్ అన్నారు. ముక్కామల లాకుల వద్ద ప్రధాన పంట కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సోమవారం తొలగించారు. పంట కాలువలో గుర్రపుడెక్కతో పాటు, వివిధ జంతువుల కళేబరాలు, వ్యర్థాలను ఔట్ సోర్సింగ్ లస్కర్‌లు పులిదిండి ఏడుకొండలు, ప్రసాద్, సందీప్, సురేష్, పవన్‌ల పర్యవేక్షణలో తొలగించి శుభ్రం చేశారు. చెత్తచెదారం, కళేబరాలు వేయడం వల్ల లాకుల వద్ద పేరుకుపోయి దుర్వాసన వెదజల్లడమే కాకుండా సాగు నీరు ముందుకు సాగడం లేదన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించండి

అంబాజీపేట: పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో ప్రారంభించిన ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని హెచ్‌ఎం కేఎస్ కనకదుర్గ అన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారి ఇళ్లకు వెళ్లి ప్రచారం చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఎంపీసీ ఆరుగురు, సీఈసీ ముగ్గురు విద్యార్థులు కళాశాలలో చేరారన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉంటాయని, నాణ్యమైన విద్యనందించే దిశగా లెక్చరర్లను ఏర్పాటు చేశామన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

అంబాజీపేట: ఓఎన్జీసీ అధికారులు ఎస్సీ పేటల్లో మౌలిక వసతులు కల్పించి, తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కె.పెదపూడి ఓఎన్జీసీ సైట్ వద్ద ఎస్సీ మహిళలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మహిళలు మాట్లాడుతూ ఓఎన్జీసీ సైట్ వచ్చినట్లుగని, ఇక్కడ పనులు నిర్వహిస్తున్నట్లు గాని గ్రామ సభలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవన్నారు. ఓఎన్జీసీ వాహనాలు తిరుగుతున్న సమయంలోను, సైట్‌లో పనులు జరుగుతున్నప్పుడు చుట్టు పక్కల ఇళ్లు బీటలు వారి పడిపోయే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే రహదారిని, ఇళ్ల వద్ద మరుగుదొడ్లను, మంచినీటిని, విద్యుత్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తమ పేటల్లో కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఓఎన్జీసీ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: మండలంలోని ఈతకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ సోమవారం తెలిపారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈతకోట సెక్షన్ పరిధిలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మి పోలవరం, పొడగట్లపల్లి, మట్లదొడ్డి, దేవరపల్లి, వేదిరేశ్వరం, కోసూరు నగర్, గరువు, కేతరాజుపల్లి, చెల్లిరేవు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.